క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మున్సిపల్ అధికారులు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య నేతృత్వంలో శానిటేషన్ వర్కర్లు మురుగుకాలువలు శుభ్రం చేశారు. చెత్తా చెదారం తొలగించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు.

కమ్యూనిటీ టాయిలెట్లను శుభ్రంగా ఉంచండి


టాయిలెట్ల నిర్వాహకులకు సూచనలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఉన్న కమ్యూనిటీ టాయిలెట్ల బ్లాక్‌లను క్లియర్ చేయించి శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున నిర్వాహకులను ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని కూరగాయల మార్కెట్, హనుమేష్‌నగర్, తదితర ఏరియాల్లోని కమ్యూనిటీ టాయిలెట్లను శానిటరీ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. టాయిలెట్ల చిన్న చిన్న మరమ్మతులను వెంటనే చేయించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా టాయిలెట్ల వద్ద సున్నం వేయించి ఫాగింగ్ చేయించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్ రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దారు సుమతి తెలిపారు. మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన కసాపురం ఈఓ


స్వామి తీర్థప్రసాదాలను ఎమ్మెల్యే వైవీఆర్‌కు అందిస్తున్న ఈఓ గురుప్రసాద్

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఈఓ గురుప్రసాద్ ఆదివారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా స్వామివారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేసిన ఈఓ ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

రాజ్యాధికారం వైపు అడుగులేద్దాం


మాట్లాడుతున్న సిరాజ్

తాడిపత్రి అర్బన్ : ముస్లిం సామాజిక హక్కులు సాధిస్తూ రాజ్యాధికారం వైపు అడుగులేద్దామని ముస్లిం ఐక్యవేదిక సభ గౌరవాధ్యక్షుడు సిరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం హనుమాన్ జంక్షన్‌లోని మున్సిపల్ ఆడిటోరియంలో ముస్లిం ఐక్యవేదిక సభ నిర్వహించారు. ఈసందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ ముస్లిం ఐక్యవేదిక పార్టీలు, ముస్లిం ఫిరకాలకు అతీతంగా పని చేస్తోందన్నారు. వివిధ విభాగాల ద్వారా సామాజిక సేవలు అందిద్దామని పిలుపు నిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హీరాపురం ఫయాజ్‌బాషా, జావిద్‌ఖాద్రీ, బాబా, జాకీర్‌హుసేన్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అనంతపురం ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు షేక్‌దాదాపీర్ మరి కొందరు కలిసి తమకు వ్యతిరేకంగా పోస్టు పెట్టారంటూ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాల వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.


గుంతకల్లులో శైలపుత్రిగా దర్శనమిచ్చిన కొల్హాపురి మహాలక్ష్మి


పెద్దపప్పూరులో బాలత్రిపుర సుందరిగా రామకోటి చౌడేశ్వరిదేవి


పుట్లూరు మండలం బాలాపురంలో పూజలందుకున్న దుర్గమ్మ


గార్లదిన్నె మండలం కల్లూరులో పార్వతీ దేవిగా వాసవీమాత


తాడిపత్రిలో బాలత్రిపురసుందరీదేవి రూపంలో వేదగాయత్రీదేవి

వైభవం.. శరన్నవరాత్రోత్సవం

సాక్షి నెట్‌వర్క్: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో ఆదివారం శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వాసవీ కన్యకాపరమేశ్వరి, దుర్గామాత, చౌడేశ్వరి, పార్వతీదేవి తదితర అమ్మవారి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మొదటి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. గుంతకల్లులో టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి వాసవీ కన్యకాపరమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.


గుంతకల్లులో బాలత్రిపుర సుందరీదేవిగా వాసవీమాత



శింగనమలలో బాలత్రిపుర సుందరి అలంకరణలో దుర్గాదేవి


రాజరాజేశ్వరి అలంకారంలో యాడికి పెద్దమ్మ తల్లి


పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడులో బాలత్రిపుర సుందరిగా చౌడేశ్వరీదేవి


పామిడిలో వెంకటేశ్వరస్వామి అలంకరణలో కన్యకా పరమేశ్వరీమాత


గుత్తిలో దివ్యాలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి


తాడిపత్రిలో రాజరాజేశ్వరీ అలంకారంలో వాసవీమాత


తాడిపత్రిలో బాల త్రిపురసుందరీదేవిగా పార్వతీదేవి

భక్తులతో అశ్వత్థం కిటకిట


అలంకరణలో శింగరబట్లు, గణపతి, అశ్వత్థనారాయణ స్వామి


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దపప్పూరు: ఆశ్వీయుజ మాసం తొలి ఆదివారం సందర్భంగా అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి తడిదుస్తులతో స్వామి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామి వారికి ముడుపులు, కానుకలు, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఆశ్వీయుజ, కార్తీక, మాఘమాసాల్లో నాలుగు ఆది, సోమ వారాల్లో భక్తులు పెద్దఎత్తున తరలివస్తారని ఆలయ అర్చకులు సుధీర్‌కుమార్ శర్మ, సునీల్ కుమార్ శర్మ, బాలసుబ్రమణ్యశర్మ తెలిపారు. భక్తులకు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాస రెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం ఏర్పాటుచేశారు.

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం


మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: రోటరీక్లబ్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి తెలిపారు. ఆదివారం రోటరీ హైస్కూల్‌లో క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా న్యూరాలజీ క్యాంప్‌ను ఆమె ప్రారంభించారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ భరత్ విష్ణురెడ్డి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, శివానంద, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రేణుక, వరలక్ష్మి, మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనంత చరిత్రకు అందమైన జ్ఞాపకం 'ఊరినెర్లు'


ఊరినెర్లు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాచపాలెం తదితరులు

అనంతపురం కల్చరల్: అనంత చరిత్రకు అందమైన జ్ఞాపకి ఊరినెర్లు పుస్తకం అద్దం పడుతుందని ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీవో హోంలో విమలా శాంతి సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో కవి కురుబ బండి కైలాసనాథ్ రచించిన 'ఊరినెర్లు' పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి అధ్యక్షత వహించారు. మధురకవి మల్లెల నరసింహమూర్తి పుస్తక సమీక్ష చేశారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, సీనియర్ కవులు రచయితలు డాక్టర్ శాంతినారాయణ, తరిమెల అమరనాథ రెడ్డి , రాజారాం, ఉప్పరపాటి వెంకటేష్, కొత్తపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు సీనియర్ గాయకుడు మహీధర్ ఆలపించిన తెలుగు వికాస ఉద్యమ గీతం అందరినీ అలరించింది. కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుకొండ లక్ష్మీనారాయణ, వల్లూరి శివప్రసాద్, కవులు యంగన్న, నబీరసూల్, చం.శాస్త్రి, జూటూరు షరీఫ్, ఈశ్వరరెడ్డి, నాగేంద్ర, ఆనంద్, వన్నప్ప, చెట్ల ఈరన్న, మధురశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కలాం అడుగు జాడల్లో నడుద్దాం


సెంట్రల్ లైబ్రరీలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమ

అనంతపురం: ప్రతి ఒక్కరూ డాక్టర్ అబ్దుల్ కలాం అడుగు జాడల్లో నడవాలని జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ పేర్కొన్నారు. ఆదివారం జేఎన్‌టీయూ పాలక భవనంలో కలాం చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరం ప్రొఫెసర్ శశిధర్ మాట్లాడుతూ భారతదేశ శాంతి సమాజ హితమే అభ్యుదయ మంత్రంగా భావించి, తన జీవితాన్ని జాతి పురోగతికి ధారపోశారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి, డైరెక్టర్లు ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి, ప్రొఫెసర్ సురేష్ బాబు, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, డాక్టర్ డి. విష్ణువర్ధన్, డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ఎస్కేయూలో: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ అబ్దుల్ కలాం చిత్ర పటానికి డాక్టర్ రామచంద్ర నివాళి అర్పించారు.
సెంట్రల్ లైబ్రరీలో: అనంతపురం సెంట్రల్ లైబ్రరీలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమా, డిప్యూటీ లైబ్రేరియన్ సుబ్బరత్నమ్మ, ఇంతియాజ్ అహమ్మద్, బాషా, కావేరి, శిరీష, ఉజ్జినేశ్వరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చిన్నారి తల్లిదండ్రులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: వైటీ చెరువు గ్రామానికి చెందిన కుమార్ రెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, ఆయన కూతురు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. కుమార్ రెడ్డి, అశ్విని దంపతుల కూతురు ఇషిక అనే చిన్నారి క్యాన్సర్‌తో హైదరాబాదులోని అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కుమార్ రెడ్డి ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే చిన్నారి వైద్యం కోసం ఖర్చుపెట్టిన డబ్బును సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరు చేయించారు. ఈ క్రమంలో మంజూరైన రూ.4 లక్షల చెక్కును ఆదివారం చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పాండురంగారెడ్డి, కసాపురం పాలకమండలి సభ్యుడు లోకనాథ్ శర్మ, శ్రీనివాస్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, కదిరిపల్లి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతిబింబం.. దాండియా నృత్యం


దాండియా నృత్యాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: సంప్రదాయ దాండియా నృత్యాలు మన సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపడతాయని వైఎస్సార్‌సీపీ నాయకురాలు డాక్టర్ అనంత మాలతి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక లేడీస్ క్లబ్‌లో దాండియా నృత్య కార్యక్రమాన్ని డాక్టర్ అనంత మాలతి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ప్రారంభించారు. దాండియా నృత్య ప్రత్యేకతలు, దసరా విశిష్టతను వివరించారు.

నేడు ప్రపంచ అనస్తీషియా దినోత్సవ ర్యాలీ

అనంతపురం మెడికల్: ప్రపంచ అనస్తీషియా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో సోమవారం ర్యాలీ ఉంటుందని డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ర్యాలీ వైద్య కళాశాల నుంచి తెలుగుతల్లి కూడలి మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని అనస్తీషియా విభాగంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్లకు కౌన్సెలింగ్

యల్లనూరు: మండలంలో ఎక్కడైనా పేకాట ఆడినా, ఆడించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని పేకాటరాయుళ్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇక నుంచి మండలంలో పేకాట ఆడితే రౌడీషీట్ నమోదు చేస్తామన్నారు.

రేపు ఎమ్మెల్యే వైవీఆర్ రాక

పామిడి: పాళ్యం గ్రామంలో మంగళవారం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి హాజరుకానున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. అనంతరం గ్రామంలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పంపనూరు సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం పూజలు నిర్వహించారు. మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆకుపూజ , అర్చన, కుజదోష కాలసర్పదోష నివారణకు మూలమంత్ర బీజాక్షర రాహుకేతు హోమం నిర్వహించారు.

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి


మృతుడు రఫిక్

గుత్తి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన ఆటోడ్రైవర్ రఫిక్(57) ఈ నెల 11న గుత్తి ఆర్‌ఎస్‌లోని అద్భుతకుమార్ లాడ్జి వద్ద ఆటో-బైక్ ఢీ కొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సంతల ఆదాయం రూ.4.29 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.4.29 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,48,030 వసూలయ్యింది. ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,81,300 మేర వసూలైందని యార్డు చైర్మన్, సెక్రటరీ తెలిపారు.

ఘనంగా యువజన ఆదివారం ఆరాధన

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం యువజన ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ మాట్లాడుతూ నేటి సమాజంలో దేవుని, పెద్దల పట్ల భయభక్తులు లేనందున యువత పెడత్రోవ పడుతున్నారన్నారు. తద్వారా వారి యవ్వన జీవితాలను తమంతకు తామే బుగ్గిపాలు చేసుకుంటున్నారన్నారు. దేవుని, పెద్దల దయ గల యువత జీవితాలు ధన్యకరమవుతాయన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, చర్చి సభ్యులు వీరయ్య, అబ్రహాం, జయరాజు, రత్నరాజు, ప్రసాద్, రజని, ప్రిస్కిల్లా, సుశీలమ్మ, చంద్రకళ, మహిమ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

శింగనమల: బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి-1, గార్లదిన్నె 1,2, పుట్లూరు మండలం బాలాపురం సచివాలయాల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.
తాడిపత్రిటౌన్: బోగసముద్రం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రంగారావు తెలిపారు. గ్రామస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జాకీ మీద పడి వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన శ్రీధర్

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఆదివారం ప్రమాదవశాత్తు జాకీ మీద పడటంతో ఓ మెకానిక్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..మెకానిక్ శ్రీధర్ జాకీని ఎత్తి పైన పెట్టడానికి ప్రయత్నిస్తున్న సమయంలో జారి కాళ్లపై పడింది. కాలుకు తీవ్రంగా గాయం కావటంతో స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇద్దరికి తీవ్రగాయాలు..

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద ఆదివారం ఆటో బోల్తాపడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు, రామాంజి అనే ఇద్దరు వ్యక్తులు గాయపడ్డాడు. పత్తికొండ ప్రయాణికులతో ఆటో పామిడికి బయలుదేరింది. ఆటో గాంధీ సర్కిల్ వద్ద రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీనివాసులు, రామాంజి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నిరుద్యోగులకు శిక్షణ

బుక్కరాయసముద్రం: రోటరీపురంలోని అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అభయ సీసీఎల్ క్యాంపస్ కోఆర్డినేటర్ భార్గవ్ ఆదివారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు డ్రైవింగ్, టైలరింగ్, మొబైల్ రిపేరీ, కంప్యూటర్ బేసిక్స్, బ్యూటీషియన్స్ తదితర వాటిలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణలో భోజనం, వసతి కల్పిస్తున్నామని తెలిపారు. వివరాలకు 9701241487 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నిరుపయోగంగా సొసైటీ కార్యాలయం


సొసైటీ కార్యాలయం ఎదుట ముళ్ల పొదలు దర్శనమిస్తున్న దృశ్యం

పుట్లూరు: మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం నిరుపయోగంగా మారింది. ఇక్కడ పని చేసే సిబ్బంది తాడిపత్రి నుంచే విధులు నిర్వహిస్తుండటంతో సొసైటీ కార్యాలయం తలుపులు తీసే వారు లేక కార్యాలయం ముందు ముళ్ల పొదలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సొసైటీ కార్యాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

అబ్దుల్ కలామ్ ఆశయ సాధనకు పాటుపడదాం


కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థిసేన నాయకులు

గుంతకల్లుటౌన్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాల సాధనకు పాటుపడతామని విద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ తెలిపారు. ఆదివారం కలాం 92వ జయంతి సందర్భంగా 60 అడుగుల రోడ్డులోని ఆ మహనీయుడి విగ్రహానికి విద్యార్థి సేన నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాసిద్ మాట్లాడుతూ కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి యువతను తట్టిలేపిన మహాపురుషుడు అబ్దుల్ కలాం అని అన్నారు. దేశానికి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా కలాం అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సేన కార్యదర్శి మహేష్‌గుప్త, నాయకులు మహబూబ్‌బాషా, గౌస్, రామాంజి, రియాజ్, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

వెండి బిందె వితరణ


ఆలయానికి బహూకరించిన వెండి బిందె

పామిడి: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయానికి ఆదివారం గుంతకల్లువాసి రామకృష్ణయ్య వెండి బిందె వితరణ చేశారు. అమ్మవారి పూజకు స్టీల్ బిందెలో జలాన్ని తీసుకెళ్తున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన రూ.1.5 లక్షల విలువ చేసే బిందెను అందజేశారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు ఉపేంద్ర, కమిటీ సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.